# ముక్కపిల్ల



నడివీధిలో పడ్డాడు అప్పన్న!

తనకు తానుగా పడలేదు.

అబ్బచేసిన చేతలకు అప్పన్న వీధిన పడ్డాడు.

నడిమిట్టమీద పొద్దు. ఉచ్చి పీకుతూ ఉంది. దాహం వేసింది. ఊరికి దక్షిణంగా ఉన్న కొబ్బరినీళ్ళ కొలను మనసులో మెదిలింది. కొలనుతట్టుచూశాడు. కొలనుగట్టు– గట్టుమీద... కాసిరాతి బండలు– కొలనుకు తూర్పున సత్రం కనిపించాయి. తుపుక్కున ఉమ్మాడు. గిరక్కున వెనక్కు తిరిగాడు. ఇల్లు కంటపడింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆలోచిస్తూ ఎటో దృష్టి మరల్చాడు. ఊరి ముందర పొలాలు కనుపించాయి కనులపండువుగా! కడుపురగిలింది.

పేదవాడి కోపం పెదవికి చేటు!

ఏమీ చేయలేని స్థితి!

ఈ వయస్సులోనే తన కాళ్ళమీద తాను నిలబడవలసిన గతి!

వంగి తనకాళ్ళను తానే చూసుకొన్నాడు.

కాళ్ళముందర ఓ కుక్కపిల్ల! తనకంటూ ఒక ఇల్లు ఉన్నప్పుడు మందవెంట పడి తిరుగుతూ ఉండేది ఓ కుక్క. ఆ కుక్క ఈనింది. ఈనిన నెల తిరక్కముందే ఏ మాయదారి రోగమొచ్చిందో ఏమో?– ఆ కుక్క చచ్చిపోయింది. తల్లిపాలకు ఆదరణకు నోచుకోని ఆ కుక్కపిల్లలు ఒక్కొక్కటిగా జీవితాన్ని కడతేర్చుకొని వెళ్ళిపోతే కడకు మిగిలింది ఒకే ఒక్క కుక్కపిల్ల. కాళ్ళముందర నిలబడి ఉంది.

గొర్రెలమంద పోయింది. ఎద్దులు పోయాయి. ఆవులు పోయాయి. ఇల్లూవాకిలీ పోయింది. పొలము పుట్రా పోయింది. కని పెంచిన తల్లీదండ్రి పోయారు. కానీ చిన్నప్పటి నుండి తాను విసిరేసింది తిని వెంట తిరిగిన కుక్కపిల్ల మాత్రం వదిలిపోలేదు. అందుకే విశ్వాసాన్ని కుక్కతో ముడిపెట్టారు.

అప్పన్న పెదాలపై ఓ చిరునవ్వు తొంగిచూసి తొలిగిపోయింది.

నడివీధిలో అలానే నిలబడ్డాడు అప్పన్న!...

అది ఒక పల్లె!

ఆ పల్లె ఈ పవిత్ర భారతదేశంలోనే ఉంది.

ఎత్తయిన మేడల్ని– మత్తులో తూలే కన్నుల్ని– మేడమీద కండల్ని చూపించి– ఇవి మనం సాధించిన ప్రగతికి నిదర్శనాలు కావా? అని అడిగే ఓ ప్రబుద్ధుడికి– పైకప్పుకు పిడికెడు చెత్తకి నోచుకోని పూరి కొంపల్ని... కన్నీళ్లు కాపురం పెట్టిన చెంపల్ని చూపించి మరి వీటినేమంటావ్? అని సవాల్ చేయడానికి సాక్షిగా నిలబడిందా పల్లె.

ఆ పల్లెకు దక్షిణంగా ఓ కొలను!

ఆ కొలనుకు తూర్పుగా ఓ సత్రం. భవబంధాల విముక్తికై ఓ మనిషి చేసిన ప్రయత్నం ఫలించిదనుకొనేలోపలే అతని బతుకు పండింది. అతడు భవబంధాల నుండి శాశ్వతంగా సెలవు దీసుకొని వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆ సత్రం గతి అంతే.

"నలగరి బతుకులు నిలవనాముంచేసి ఇట్టామాదిర సత్రాలు చావిళ్ళు కట్టిస్తే వాటి గెతి ఇంతే" అనిందాపల్లె!

ఆ పల్లెలో ఆడవాళ్ళచేతి మగవాళ్ళున్నారు. మగవాళ్ళచేతి ఆడవాళ్ళున్నారు. అసలు సిసలైన మగవాళ్ళు ఉన్నారు. వీళ్లందర్నీ తలదన్నే 'మగరాయుళ్ళు' ఉన్నారు.

ఆడవాళ్ళ చేతి మగవాళ్ళయినా– మగవాళ్ళచేతి ఆడవాళ్ళయినా– "ఆడ మగ"లో అట్టే తేడాలుండవు. కాబట్టి వాళ్ళను గురించి ఆలోచించవలసిన అవసరం లేదు.

ఇక మగరాయుళ్ళంటారా? పొద్దుపుట్టి బారెడెక్కకముందే కొలనుగట్టుపై చేరతారు. కొలనుగట్టున ఓ చెట్టు నీడలో టీ కొట్టు! టీ కొట్టులో అందాల అలిమేలు. ఆమె చేతి టీకి

రుచి ఎక్కువ. ఆప్యాయంగా తాగుతారు. ఆపై కొందరు కాసిరాతి బండలమీదికి మరికొందరు సత్రంలోకి చేరుకొంటారు.

కాసిరాతి బండలమీద పులిజూదం... సత్రంలో పేకాట! పంతాలమీద కొనసాగుతూ ఉంటుంది. ఆడేవాళ్ళు కొందరయితే పక్కన కూర్చుని పై పందెం కాసేవాళ్ళు కొందరు. ఊరుమీద ఊరు పడచ్చు. పొద్దుగూట్లో పడచ్చు. అది పులిజూదం కానీ, లేదా పేకాటకాని ఆగడానికి మాత్రం వీల్లేదు.

ఈ మగరాయుళ్ళకు కన్ను కత్తరించడానికి తెలుసు!

అంతకంటే లేసుగా కన్నెచెర విడిపించడానికీ తెలుసు! టెంకాయలు కావచ్చు. అవి మిరప తోటల్లో వంకాయలు కావచ్చు. తోటల్లో మామిడి కాయలు కావచ్చు. రెడ్డోరి నిమ్మతోటలో నిమ్మకాయలైనా కావచ్చు.

ఏ కాపు కా కాపు!

మాటు మణిగితే చాలు. మనిషి మొగం మనిషికి కనిపించిన చీకటి అలుముకొంటే చాలు. పండిన పంట పొలాలమీద పడడమో? లేకుంటే– కాపుకొచ్చిన తోటలమీద పడడమో? ఆ మగరాయుళ్ళకొక సరదా!

కోసుకొచ్చిన కాయలో... పులుముకొచ్చిన ధాన్యమో?– వీలైతే అలిమేలు అంగడి చేరుతుంది. లేకుంటే సరాసరి అక్కడికి నాలుగు మైళ్ళ దూరాన ఉన్న పేట చేరుతుంది. అక్కడ చేతులు మారుతుంది. చేతులు మారమంటే బేరం. అది ఒకటికి సగంగా బేరం. ఆ బేరంలో నాలుగుకాసులు మగరాయుళ్ళ చేతికందుతుంది. ఆ మరునాడు పులిజూదానికో పేకాటకో పెట్టుబడి అవుతుంది.

ఇక ఆ ఊళ్ళో అసలు సిసలైన మగవాళ్ళున్నారు. వాళ్ళు ఎద్దులగొట్టి ముద్దలు తింటారు. వాళ్ళు దేశానికి వెన్నెముకలు.

ఈ అసలుసిసలైన మగవాళ్ళలో అప్పన్న ఒకడు!

ఈ అసలుసిసలైన మగవాళ్ళందరూ ఎద్దులగొట్టి ముద్దలు తింటుంటే అప్పన్న కూడా అదే పనిచేయాలి. అయితే అప్పన్నకు అరసెంటు భూమిలేదు.

అప్పన్న తండ్రి సుబ్బన్న. సుబ్బన్న ఆ పల్లెలో కాడెద్దుల సేద్యగాడు. మూడంకణాల పూరిల్లు. ఆ పూరింటి ముందర ఓ పశువుల కొట్టం. ఆ కొట్టంలో కాడిమెడమీద పెడితే ఖణిల్లని రంకేసే జోడుగిత్తలు. పూటకు రెండు ముంతల పాలు పిదిగే రెండు పాడి ఆవులు. ఇంటివెనక ఇంటికి తగినంత ఖాళీ జాగా. ఆ జాగాలో ఓ మందగొర్రెలు.

"సుబ్బన్న కేంవుందిలే!" అంటే ఒప్పుకోరు.

సుబ్బన్న పెళ్లాం గంగులమ్మ. చక్కని చుక్కలాంటి చిక్కని మనిషి. పొలానికి వెళ్ళినా, ఇంటి దగ్గరైనా వాళ్ళిద్దరూ కూడామాడా పనిచేసుకొంటుంటే చూడముచ్చటగా ఉంటుంది.

ఆమె ఇంటి ముందు కళ్ళాపు చల్లుతూంటే అతడు పేడదిబ్బకెత్తుతాడు. అతడు కపిలకడితే ఆమె పార చేతపట్టుంది.

అతడు మడక దున్నుతూంటే ఆమె పెద్ద పెద్ద పిట్టలు పగులగొడుతూ ఉంటుంది.

రెండుబార్ల పొద్దెక్క ముందే పొలం పనులు ముగిస్తారు. రెండు బార్ల పొద్దెక్కేసరికి ఇల్లు చేరతారు. ఒకరు ఆవుల పాలుపిండుతూంటే ఇంకొకరు గొర్రెల పాలు పిదుకుతారు. ఆమె పాలచెంబు చేతపట్టి అలివేలు అంగడికి వెళుతుంది. అతడు గొర్రెల మంద వెంటపడతాడు.

ఈ పవిత్ర భారతదేశంలో ముప్పైకోట్ల జనాభా అరవైకోట్లకు దాటింది. ఈ సమస్యకు ఇప్పుడిప్పుడే ఆలోచన నామమాత్రంగా ఆరంభమై, మే మిద్దరు- మాకు ముగ్గురా? లేక ఇద్దరా? అన్న మీమాంసలో పడింది. కానీ మేమిద్దరు- మాకు ఒక్కడే అన్నాడు సుబ్బన్న! సుబ్బన్న కొడుకు అప్పన్న.

అప్పన్న అల్లారుముద్దుగా పెరుగుతున్నాడు.

కడవడు పాలు చెడిపోవడానికి ఓ ఉప్పుకల్లు చాలు.

పొంగుతున్న సంసారం పొయ్యి పాలుకావడానికి ఏమాత్రం ఏమరుపాటైనా చాలు!

గొర్రెల కాచుకొంటూ బండలమీద కూర్చొని ఉబుసుపోకకు నేర్చుకొన్న పులిజాదం సుబ్బన్నను గుంటకట్టమీద కాసిరాతిబండల మీదికి చేర్చింది.

జూదంలో అతడు "పులి" అనిపించుకొంటూ ఒక్కొక్క మెట్టు పైకెక్కుతున్నాడు. అయితే సంసార పక్షంగా పరిస్థితి మెట్టుమెట్టుగా కిందికి దిగుతూ ఉంది.

గొర్రెల మేపడానికి మనిషి లేక సుబ్బన్న మందను అమ్మకానికి పెట్టాడు. ఆ మాట విని గంగులమ్మ కుయ్యో మొర్రో అని మొత్తుకొనింది. పులిజూదం మోజులో తలమునకలవుతున్న సుబ్బన్న ఆలి మాటల్ని ఆలకించడానికి ఆస్కారం లేకపోయింది.

గొర్రెలమంద "రెడ్డోరి" మందలో కలిసిపోయింది.

సుబ్బన్నచేతిలో నాలుగు కాసులు మెదులుతున్నాయి. ఆ హుషారులో సుబ్బన్న మకాం కాసిరాతి బండలమీది నుండి సత్రానికి మారింది. ఇప్పుడు చింతగింజలకు బదులు వింత వింత రంగుల ఇస్‌పెట్టాకులు సుబ్బన్న చేతిలో తిరుగుతున్నాయి.

సుబ్బన్న చేతికి పైసలు చింతగింజల్లా వస్తున్నాయి. పోతున్నాయి.

ఓడిపోతూనే ఉంటే ఆడడమంత అందగించదేమోగానీ, గెలుస్తూ ఓడుతూ ఉంటే ఆ మజానే వేరు. సుబ్బన్నకు పెళ్ళాం, పిల్లలు ఇల్లు వాకిలీ ఏమీ కనిపించలేదు. ఒకవేళ కనిపించినా కన్నెర్ర చేస్తున్నాడు. కానీ ఆటలో కావలసిన ఆకు చేతికందితే అందలమెక్కినంత కాదు, ఆట గెలిచినంత సంబరపడుతున్నాడు.

గంగులమ్మ విషమిస్తున్న పరిస్థితుల్ని గమనించింది. భవిష్యత్తును గురించి ఆలోచించింది. ఒక్కగానొక్క బిడ్డను అక్కున చేర్చుకొని ఒంటరిగా కూర్చొని ఏడ్చింది. వాడి భవిష్యత్తును తలపోసి కలవరపడింది. కనీసం వాడికోసమైనా మనిషిగా బతకడానికి నిర్ణయించుకొనింది.

ఆ మరసటిరోజే ఓ సేద్యగాడిని కుదిరించుకొనింది. ఆయన ఇంటికంటూ వస్తే వేళకింత తిండి పెడదామను కొనింది. ఆ ఇంటికి ఆడామగా తానే అయినట్లు ఇంట్లో పొలంలో కూడా రాత్రింబవళ్ళు పోరకలాడింది.

ఓరోజు రెండుబారల పొద్దెక్కింది. అప్పుడే గంగులమ్మ పొలం నుండి ఇంటికి వచ్చింది. గడపలో కాలుబెడుతూ కాలటూయిటు కదపలేకుండా నిలబడిపోయింది.

భుజాన బండి కదులుగోలు చేతిలో ఎద్దుల పగ్గాలు అలానే ఉన్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తుంటే ఆమె కడుపులో దేవినట్లయింది. కండ్లు తిరుగుతున్నాయి. ఇల్లు తలక్రిందులవు తున్నట్లుంది. నిలబడడం కష్టమనిపిస్తూ ఉంది. చేతిలో పగ్గాలు చేజారిపోతున్నాయి. భుజాన బండీకదురుగోలు జారి కాలిమీద పడ్డాయి.

అమె కుప్పగా కూలిపోయింది!

ఆ ఇంటి అలమంద కన్నీళ్ళతో కదిలిపోతూ ఉంది.

సుబ్బన్న తిరిగి చూడకుండా గుంటకట్ట ఎక్కుతున్నాడు.

కుప్పగా కూలిపోయిన గంగులమ్మను ఎవరో పట్టి పైకిలేపారు. పైకి లేస్తే తనకు తానుగా లేవాలి కానీ, ఒకరు లేపితే ఎంతవరకు? మంచమీది వరకు.

మనోవ్యాధికి మందు లేదు.

ఆమె మళ్ళీ పైకి లేవలేదు!

సుబ్బన్న అప్పుడప్పుడు ఈ లోకంలోనికి వస్తున్నాడు. వచ్చినప్పుడు మాత్రం ఓ క్షణం మంచానికి కరుచుకొన్న పెళ్ళాన్ని, కంచం ముందు కూర్చొని అరుస్తున్న కొడుకును గురించి ఆలోచిస్తాడు. బాధ కలుగుతుంది. బాధోపశమనానికి మందు. అదే పుచ్చుకొంటాడు గవర్నమెంటు సారాయి కొట్లో! మళ్ళీ అదే లోకానికి వెళ్ళిపోతాడు.

సుబ్బన్న ఈ లోకంలో మనిషిగా జీవిస్తూ ఆ లోకంలో పడి ఆడుతున్నప్పుడు ఓడుతూ ఉండేవాడు. ఓడినదానికంటే ఎక్కువగా గెలిచేవాడు. కానీ ఆ లోకంలోనే మనిషిగా మిగిలినపుడు ఓడిపోవడమే ఎక్కువయింది.

ఓడిపోతుంటే బాధ. బాధకు విరుగుడు మందు. మందుతో బాధ విరుగుడైతే ఆనందం. ఆనందంలో మళ్ళీ ఆట. ఆడితే మళ్ళీ ఓటమి. ఓడితే చేతిలో డబ్బుండదు. డబ్బు లేకపోతే ఆట కొనసాగదు. ఎలాగైనా ఆడాలి. ఆడాలంటే డబ్బు కావాలి. ఆస్తిని అమ్ముతూపోతే వస్తూ ఉంటుంది డబ్బు. అయితే తవ్వుతూపోతే కొండలైనా తరిగిపోయినట్లు అమ్ముతూపోతే ఆస్తులు హరించి పొయ్యేది ఎంతసేపు?

సుబ్బన్న జీవితంలో పూర్తిగా ఓడిపోయాడు.

మనోవ్యాధితో మంచమెక్కి తల్లి పోయింది.

తాగి తాగి తండ్రి తల్లికి తోడుగా వెళ్ళిపోయాడు.

అప్పన్న వీధిని పడ్డాడు. అప్పుడతని వయస్సు పదిహేనేండ్లు.

"ఒరె! పొద్దుగూకులా ఇట్లా ఈ సెట్లకింద కూసోని ఆడతావుంటే రేపెట్లా బతకపోతా(రా! మణుసులుగా పుడ్తే సరా? సిగ్గూ సీంవూ ఉండక్కర్లా?"

గుంటకట్టమీద బాధ్యత బాధపడుతూ ఉంది! ఆ మాటలు అప్పన్న చెవిని పడ్డాయి.

"అవును. ఇక్కడ నిలబడుకోని గంటల తరబడి ఆలోచిస్తే కడుపుకు కూడు?"– ఆలోచించాడు అప్పన్న.

దొరకదన్నట్లు తల అడ్డంగా ఊగింది!

అందుకే బయలుదేరాడు ఆ చిన్నవాడు.

వంచిన తల ఎత్తకుండా ఊరికి ఉత్తరంగా నడిచాడు. దారి సాగినంత దూరం నడిచి ఆగినచోట నిలబడ్డాడు. నిలబడి తల పైకెత్తి చూశాడు. ఎదురుగా కొండలు. పల్లెకు కోట గోడల్లా ఎత్తయిన కొండలు. ఆ కొండల మీద పడ్డాడు. కొన్ని చేతికి దొరికాయి. మరికొన్నింటిని చెట్టెక్కి విరిచాడు. అన్నీ ఎండుపుల్లలు. ఓ మోపుగట్టాడు. నెత్తికెత్తుకొన్నాడు. ఊళ్ళోకి బయలు దేరాడు.

నీడలా వెన్నంటి వస్తూనే ఉంది కుక్కపిల్ల!

ఊరికి ఉత్తరంగా ఓ పెద్దబావి. ఆ బావిగట్టున ఓ కానగ చెట్టు. ఆ చెట్టు బోదెకు మోపును ఆనించాడు. మెడ విరుచుకొన్నాడు. చేతకాని పని. అలవాటు లేదు. కాళ్ళు నిలబడడం లేదు. చెట్టు బోదెకు చేరగిలపడ్డాడు. ఆ బాధను చూడలేనన్నట్లుగా కుక్కపిల్ల 'కుయ్యో! కుయ్యో!!' మంటూ పక్కన ఒదిగింది. ఒదిగిన కుక్కపిల్లను ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నాడు అప్పన్న.

కట్టెలు తెమ్మని ఎవరూ అడగలేదు. ఎవరికి అవసరమోకూడా తెలియదు ఒక్కగానొక్క కొడుకు ఉద్యోగాలు చేసి ఊళ్ళేలాలని ఆశించిన తల్లి ముదిగారంతో సేద్యం జోలికి పోనివ్వని కారణంగా ఒళ్ళు వంగలేదు. కట్టెలు తేవడానికి కడుపు పూడడానికి సంబంధముందని మాత్రం ఆలోచించగలిగాడు. తీరా తెచ్చిన తరువాత ఏమి చేయాలో తోచలేదు.

తనకంటే నిస్సహాయంగా తనవైపు చూస్తూ ఉంది కుక్కపిల్ల!

అప్పన్న నిమురుతూ ఉంటే ఏదో ఆలోచన వచ్చినట్లు ఎగిరిపడి లేచింది కుక్కపిల్ల. అతని జుట్టు నోటగరిచి లాగుతూ ఉంది. అసలే అలిసిసొలిసి ఉన్న అప్పన్నకు కోపం ముంచు కొచ్చింది. విదిలించి కొట్టాడు. కానీ అది అదిరిపోలేదు. బెదిరిపోలేదు. జుట్టు వదిలిపెట్టి మొలగుడ్డను పట్టి లాగుతూ ఉంది. ఏమీ తోచక అప్పన్న విసుక్కొన్నాడు. అది కాళ్ళమీదపడి

వేడుకొన్నట్లు చూస్తూ ఉంది. కాళ్ళు నాకుతూ ఉంది. దాని తపన అర్థంకాక దాన్నే చూస్తుంటే మళ్ళీ మొలగుడ్డను పట్టి ముందుకు లాగుతూ ఉంది. దాని పోరుపడలేక పైకిలేచాడు అప్పన్న. కట్టెల మోపు నెత్తికెత్తుకొన్నాడు.

ఇంతవరకు వెంటపడిన కుక్కపిల్ల ఇప్పుడు ముందునడుస్తూ ఉంది!

దాని తీరుకు ఆశ్చర్యపడుతూ అప్పన్న దాని వెంటపడ్డాడు. అది నేరుగా 'రెడ్డోరి' ఇంటికి దారితీసింది. దొడ్డి గుమ్మంగుండా లోపలదూరింది. అప్పన్న దానివెంటపడి నడుస్తూనే ఉన్నాడు.

రెడ్డోరి మిద్దింటి వెనక ఓపినంత ఖాళీ జాగా ఉంది. అక్కడే పశువుల కొట్టాలున్నాయి. ఆనుకొని పెరడు ఉంది. పెరడు పక్కన్నే పెద్ద పెద్ద వేడినీళ్ళ కాగులు అమర్చిన పొవ్వులున్నాయి. అక్కడ నిలబడింది కుక్కపిల్ల. తోకాడిస్తూ.... 'కుయ్యో కుయ్యో!' అని అరుస్తూ అతని కాళ్ళ చుట్టూ తిరుగుతూ మూతిని పాదాలమీద రుద్దుతూ ఉంది.

అప్పన్న నెత్తిమీద మోపును దభీమని నేలవేశాడు.

ఆ శబ్దం విన్న రెడ్డెమ్మ ఆదరాబాదరా పెరట్లోకి వచ్చింది. ఓ క్షణం విస్తుపోతూ నిలబడింది. ఆ తరువాత 'అయ్యో పాపం! నువ్వా నాయనా!' అని బాధపడింది. ఇంట్లోకి వెళ్ళి ఓ ముద్ద సంకటి తెచ్చి అప్పన్నచేతిలో పెడుతూ 'ఎట్లాంటి వాళ్ళకెట్లాంటి కష్టం వొచ్చిందిరా దేవుడా!" అని వాపోయింది.

అప్పన్న పెద్దబావి గట్టుమీదికి నడిచాడు. కానగ చెట్టు నీడలో కూర్చున్నాడు. కుక్కపిల్ల కంత పెట్టాడు. తానంత తిన్నాడు. ప్రాణం తేలిక పడింది.

తనజీవితగమ్యానికి ఏదోఒకదారి దొరికిందని తృప్తిగా నిట్టూర్చాడు అప్పన్న!

ప్రతిరోజు అడివికి పోతున్నాడు. కట్టెలు తెస్తున్నాడు. ఏ ఇంట్లోనో ఒక ఇంట్లో తనకు ఇష్టమైన ఇంట్లో వేస్తున్నాడు. వాళ్ళు ఇంత పెడితే తింటున్నాడు. పెద్దబావి గట్టున కానుగ చెట్టు నీడలో తలదాచుకొంటున్నాడు. కుక్కపిల్ల అతని పక్కలో ముడుక్కొంటూ ఉంది.

ఇప్పుడు ఊళ్లో అందరు అప్పన్నను గురించి మాట్లాడేవాళ్ళే!

"వాడి ఈడు పిల్లకాయలు తేరకు తిని తీరిగ్గా గుంటకట్టమీద జూదమాడుకుంటా ఉంటే వాడేవో కట్టెలు తెచ్చి పొట్టబోసుకుంటున్నాడు. వాడూ బిడ్డంటే!"

ఈ మాట బోడెబ్బ చెవులో పడింది! బోడెబ్బ అప్పన్నకు మేనమామ! – నలుగురు ఆడబిడ్డల తండ్రి.

"ఎవరి నోట్లో విన్నా ఒకటే మాట! – 'అప్పన్న ఎంత మంచోడు! ఎంత మంచోడు!' అని. ఏంవిలేక పొయ్‌నా గుణవొకటుంటే అన్నీ ఉణ్ణిట్టే. చేరదీస్తే చేదోడువాదోడుగా ఉంటాడు. ఆ తరవాత దేవుడు మేలుజేస్తే ఒక బొళువూ తీరిపోతుంది!"

మేనమామ మేనల్లుణ్ణి గురించి ఆలోచించాడు.

ఆలోచించడమే తడవుగా ఓరోజు సందకాడ పనిగట్టుకొని వెళ్ళాడు.

కానగ చెట్టు బోదెకు చేరగిలబడి అప్పన్న కుక్కపిల్లతో ఆడుకొంటున్నాడు. మామను చూస్తూనే ఎగిరిపడి లేచాడు. అప్పటికి అదేదో తన ఇల్లయినట్టు ఆ ఇంట్లో మామగారికి అతిథి మర్యాదలు జరపాల్సిన బాధ్యత నెత్తినున్నట్లు 'కూర్చో మాcవా' అన్నాడు.

బోడెబ్బ ఆ చెట్టుకింద ఓరాతిమీద నిట్టూరుస్తూ కూర్చున్నాడు.

"సూడప్పన్నా! నేను బతికుండగానే నువ్విట్లా సెట్లకింద బతకడం నాకేందో బాదగానే ఉండాది. నా బిడ్డలో ఒక బిడ్డ అనుకుంటా. నేను తినేది నీకింతపెడతా. ఇంటికి వచ్చేయ్ నాయినా!"– అన్నాడు.

అదోరకంగా నవ్వాడు అప్పన్న!

"ఎందుకురా నవ్వతాఉండావే? అప్పటికీ– నా మాటమింద నీకు నమ్మకం కుదర్లేదా? పచ్చనిసెట్టు కింద కూసోని సెప్తా ఉండా!"– నమ్మించడానికి ప్రయత్నించాడు బోడెబ్బ.

"అదేcవీ లేదు మావా! మీ మాటలు అనేదానికి బాగుండాయి. వినేదానికంతకంటే బాగుండాయి. అయితే జరగడం మాత్రం కష్టం. జరగదని తెలిసి కూడా తలపోసుకుండేది తలకాయినొప్పి!– అట్లా జరిగేటట్లయితే చెట్టుకిందకేం కర్మ?– అప్పుడే నేరుగా మీ ఇంటికాడికి వచ్చేసేవాణ్ణి!– నన్నిట్లానే బతకనీ మాcవా!"– అన్నాడు.

అదీ నిజమనుకొన్న బోడెబ్బ మారు పలకలేదు.

మౌనంగా లేచివెళ్ళిపోతున్న మామను అప్పన్న అలానే చూస్తూ ఉండిపోయాడు.

చూస్తూ చూస్తూ ఉండగానే కానగ చెట్టు రెండుసార్లు దిసమొలతో నిలబడి– నలుగురు చూసి నవ్విపోతారని భయపడి పచ్చని చీర కట్టుకొని పండు ముత్తైదులా తయారయింది.

ఇప్పుడు అప్పన్న చేతికి ఓ కత్తి వచ్చింది. చంకకొక సొరకాయ బుర్రవచ్చింది. కాళ్ళకు జతచెప్పులు వచ్చాయి. అడవిలో ధైర్యంగా వెళ్ళగలిగినంత దూరం వెళ్ళగలగుతున్నాడు. ఏ కట్టె మండుతుందో ఏ కట్టెలయితే తొందరగా వెలపోతాయో అప్పన్న బాగా తెలుసుకొన్నాడు.

పుట్టమీదనో చెట్టు మీదనో నిలబడి అతడు కట్టెలు కొట్టుతుంటాడు. ఆ దరిదాపుల్లోనే నిలబడుతుంది కుక్క. అతన్ని దీనంగా చూస్తూ ఉంటుంది. కొట్టిన కట్టెల్ని మోపు కట్టుకోవడానికి ఓచోట చేరేస్తుంటాడు. అదిగూడ ఓ కట్టెను నోట కరచుకొని తెస్తుంది. అతడు మోపు నెత్తి కెత్తుకొంటే దారి చూపుతున్నట్లుగా ముందు నడుస్తుంది. మార్గమధ్యంలో అలిసి సొలిసి ఏ చెట్టు నీడలోనో మోపు దించి అలా ఆచెట్టునీడలో వాలబడితే ముందరికాళ్ళు రెండూ ఎత్తి రొమ్ముమీద పెట్టి మూతిలో మూతిపెట్టి ముదిగారం చేస్తుంది.

కష్టపడుతున్న తనని చూసి ఓ సానుభూతి వాక్యం పలకడానికి తల్లి లేదు. కష్టసుఖాల్ని పాలుపంచుకొనడానికి అన్నలు లేరు. తమ్ముళ్ళు లేరు, అక్కచెల్లెండ్రు అసలే లేరు. వెంట ఉన్నది ఓ జంతువు. దానికి నోరు లేదు. మనసులోని భావం చేష్టగామారి అప్పన్నను ఓదారుస్తుంది.

దాన్ని గమనిస్తే అప్పన్న గుండె కండ్లల్లో కరుగుతుంది. కండ్లు చెమ్మగిల్లుతాయి. చూడలేనన్నట్లుగా అది అతని రొమ్ముమీదనుండి కాళ్ళను దించేస్తుంది. తలవంచి మెలికలు తిరిగిపోతూ "కుయ్యో! కుయ్యో! అంటూ ఆ చెట్టుచుట్టూ తిరుగుతుంది.

"ఏదో ఒకబంధం లేకుండాబోతే బతుక్కు అందమే ఉండదేమో?"– అనిపిస్తుంది అలాంటి సమయాల్లో అప్పన్నకు.

"అదిగూడా దగ్గిర పడిందిరా నాయినా!" అంటూ ఓరోజు బోడెబ్బ అప్పన్నను వెతుక్కుంటూ వచ్చాడు. కష్టాన్ని నమ్ముకొన్న మనిషిని నమ్ముకుంటే నష్టముండదని బోడెబ్బ అభిప్రాయం.

"అప్పన్నా! ఎంతకాలమని ఇట్లా వొంటిగా బతకతావు నాయినా! నా మాటిను, ఇంటికొచ్చేయ్, ఇంటికి రమ్మంటూ ఉండానంటే ఏదో పనీపాట సెయ్యడానికి సేద్దిగాడుగాకాదు. నా అల్లుడుగా రా!" అభ్యర్థించాడు బోడెబ్బ.

ఆ మాటలు వింటుంటే అప్పన్నకు డబ్బు విలువ తెలిసినట్లయింది.

"మాచా! నాకా దిక్కూ దరీ లేదు. తలదాచుకుండేదానికి జానెడు కొంపలేదు. కట్టెలమ్ము కుంటే కడుపు పూడతాఉండాది. నన్ను అల్లుణ్ణిగా చేసుకుంటానంటే నా చెవుల్ని నేనే నమ్మలేక పోతాఉండాను. నీ కూతుర్ని పువ్వుల్లో పెట్టి పూజించుకుంటా! కానీ పువ్వుల్లో పెట్టి పూజించు కుంటానన్నా ఇల్లరికం మాత్రం రాను మాచా!"

పొంగిపోయాడు బోడెబ్బ. అల్లుడు సంపన్నుడు కాకపోయినా అభిమాన సంపన్నుడని! కానగచెట్టు తెల్లని పువ్వుల్ని పలపల రాల్చింది.

కట్టెలమ్మేవాడిచేత తాళి కట్టించుకోవడానికి కాంతమ్మ మనస్సు ఎదురుతిరిగింది. ఏకాంతంగా కూర్చొని ఏడ్చుకొనింది.

కానీ పల్లె మనస్తత్వం, పల్లెత్తు మాట పలకలేకపోయింది.

కాంతమ్మ, అప్పన్నా ఓ శుభగడియలో ఆలూమగలయ్యారు.

ఊరికి చివరగా ఓ పూరి గుడిసెలో కాపురం పెట్టారు.

అప్పన్న బాధ్యత పెరిగింది. కానీ బతుకుతెరువు మారలేదు.

కోడికూతతో నిద్రలేస్తాడు. ఇప్పుడు సొరకాయ బుర్రకు ఓ 'సిక్కం' తోడయింది. కాంతమ్మ సిక్కంలో అంత సంకటి కట్టిస్తుంది. 'సొరకాయ బుర్ర' 'సిక్కం' భుజాన వేలాడుతుంటాయి. కత్తి చేతిలో ఉంటుంది. కుక్కవెంట పడుతుంది. బయలుదేరతాడు. అడవిలో వెదికి వెదికి మంచి చేవదేరిన కట్టెల్ని కొట్టుకుంటాడు. మోపు కట్టేటపుడు అందమైన పెళ్ళాం మొగం మనసులో మెదులుతుంది. ఆ మొగంలో ఓ చిరునవ్వు చూడాలంటే నాలుగు కాసులు ఎక్కువగా సంపాదించాలి. అందంగా కడతాడు మోపు. ఇప్పుడు అప్పన్న బేరం పల్లెనుండి పేటకు ఎదిగింది. కాంతమ్మ కట్టిచ్చిన కవళాన్ని ఎండపొద్దున ఏ బావిగట్టునో కూర్చొనితిని అటునుండి

అటే అడ్డదారిపట్టి పేట చేరుతాడు. కట్టెలమ్ముకొంటాడు. పొద్దు గూట్లో పడేసరికి ఇల్లు చేరతాడు. వచ్చిన డబ్బును పైసలతోసహా కాంతమ్మ చేతుల్లో పోస్తాడు!

కానీ కాంతమ్మకు ఏదో వెలితి?–

తన బతుకు ఆ గుండుగుడిసెకే కుదించుపోయిందని తపన!

ఇరుగు పొరుగు ఇంతకంటే ఎంతో హీనంగా బతుకుతున్నా తనది వాళ్ళకంటే ఇంకా హీనమైన బతుకని తనకు తనకే అలకువ!

బతికినంత బతుకు బతికి కడకు కట్టెలమ్ముకొనేవాడితో కాపురమా అన్న ఆవేదన!

ఎంత కప్పిపుచ్చుకున్నా వీటి ప్రభావం ఎప్పుడో ఒకప్పుడు అప్పన్న మీద పడుతూనే ఉన్నాయి. ఆ మాత్రం గ్రహించలేని అమాయకుడేమీ కాదు అప్పన్న. ఏ సమస్య అయినా కాలం చేతిలో పెట్టడం మంచిదన్న అభిప్రాయంతో నోరు కదిపేవాడు కాదు. పైగా మామ గారికి మాట ఇచ్చాడు– పువ్వులో పెట్టి పూజించుకుంటానని!

ఓర్పు మంచిదే అయితే అమితమైన ఓర్పు బలహీనత కింద లెక్కకెక్కుతుంది. ఒకసారి లెక్క కెక్కిందంటే చెల్లుబడడం మహాకష్టం.

అప్పన్న విషయంలో అక్షరాలా అంతే జరిగింది.

కాంతమ్మ కారణం లేకనే చీటికీ మాటికి ఈసడించుకోవడానికి అలవాటుపడిపోయింది.

అప్పన్నకు ఎప్పుడూ అడవిలోనే పొద్దుమొలిచేది. ఊళ్ళోనే పొద్దుకుంకేది. పొద్దు మొలిచి కుంకేలోపుగా అతడి ఆవజీవాలు అణిగిపోతాయి. అప్పుడలా నాలుగు ముంతల వేడినీళ్ళు వొంటిమీద జారపోసుకుంటాడు. ఇంత ఎంగిలిపడతాడు. నులకమంచంమీద నడుం వాలుస్తూ ఉంటే కాంతమ్మ పాఠం ఆరంభిస్తుంది.

"ఏం బతుకో!.... ఇరంపరం లేనిబతుకు!... ఒక మంచీ లేదు, సెడ్డా లేదు. ఇరుగు పొరుగు అమ్మలక్కలు టింగురంగా అని సింగారించుకొని వారానికొకసారైనా పోతా ఉంటారు పేటకు సిల్మాకని. సిలమా లేదు. గిలమా లేదు. వండుకునేది. తినేది. పొణుకునేది. ఇదీ ఒక బతుకేనా?"

అప్పన్న బెల్లం కొట్టిన రాయిలా ఉండడానికి అలవాటు పడిపోయాడు.

పెద్దబావి గట్టున కానగ చెట్టు పాతచీరల్ని విప్పి విప్పి కొత్త చీరల్ని కడుతూనే ఉంది.

ఓ రోజు–

అప్పన్న ఇల్లు చేరడానికి చాలా ఆలస్యమయింది.

ఆ రోజు ఎంత తిరిగినా పేటలో అమ్మబోతే అడివిగా తయారయింది పరిస్థితి. తిరిగి తిరిగి విసిగిపోయాడు అప్పన్న. ఎవరికో ఒకరికి ధారపోసే సరికి పేటలోనే కనుచీకటి పడింది. ఆలస్యమయి పోయిందనుకొంటూనే అప్పన్న ఇంటికి వచ్చాడు. ఇంట్లో కాలు పెడుతూనే కాలు గీరడానికి సిద్ధంగా నిలబడి ఉంది కాంతమ్మ.

"ఎందుకట్లా కదిలీ మెదలకుండా మాను మాదిరి నిలబడుకున్నావే?"– రెట్టించింది కాంతమ్మ.

"అయితే ఏం జెయ్యమంటావ్?"–

అలిసి సొలిసిన ప్రాణం. ఎక్కడ లేని విసుగు. ఒక్కమాట వెలువడింది చాలా కాలానికి.

"నువ్వేంవీ సెయ్యాల్సిన పనిలేదు. పెళ్ళో నీళ్ళు కాగతా ఉండాయి. మూకిట్లో అంత సంకటేసి పెట్నాను. తినేసి పొణుకో!– ఈదినాటకఁవంట. నేను పొయ్యి సూసేసొస్తా!"

నోట్లో మాట నోట్లోనే ఉంది.

కాంతమ్మ గడపదాటి పోతూ ఉంది. భర్త అనుమతికోసరం ఎదురుచూడలేదు. అసలు ఆ అవసరమున్నట్లు ఆమెకు తోచలేదు. తనలో తాను నవ్వుకొన్నాడు అప్పన్న. ఆ తరువాత అక్కడనుండి కదిలాడు!...

కాంతమ్మ అమ్మలక్కలతో చేరింది. ఏదో చెరనుండి విముక్తి పొందినట్లుందామెకు. ఆమె ఆనందానికి అవధులే లేవు. నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ తూలుతూ పేలుతూ ఏదో స్వర్గ సుఖాన్ని చవిచూడబోతున్నట్లు వెళ్ళింది నాటకం చూడడానికి!–

సతీ సావిత్రి నాటకం!

కాంతమ్మ అక్కడ చేరేసరికి ఊరు ఊరంతా అక్కడే ఉంది. కూర్చొనేదానికి కాసంత చోటు సంపాదించుకోవడమే కష్టమైపోయింది. ఎలాగో వాళ్ళను వీళ్ళను బతిమలాడి తంటాలు పడింది. చంకలో గోనెపట్ట పరిచి కూర్చొనింది.

నాటకం ఆరంభమయింది.

సత్యవంతుడు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చి జీవిస్తున్నాడు.

"ఇది బలే బాగుండాదే కత! ఇంటికంటే గుడి బద్రమనుకుంటే అదిగూడ ఆడికే ఉండాదే!– రాఁవేశ్వరం పొయ్‌నా శనేశ్వరం వదల్లేదంట. ఈడకూడా కట్టెల యాపాడఁవేనా?"

అనలేదు కానీ అనుకొనింది కాంతమ్మ.

కానీ సావిత్రి భర్తను దైవసమానంగా పూజిస్తూ ఉంది. అతనికి సకలోపచారాలు స్వయంగా నెరవేరుస్తూ ఉంది. వాళ్ళు ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు.

కాంతమ్మకు ఏదో ఎబ్బెట్టుగా తోచింది. నాటకం జరిగేకొద్దీ ఆమెకు ఆశ్చర్యం కలుగుతూ ఉంది.

ఓరోజు సత్యవంతుడు అడివికి వెళ్ళాడు. ఆరోజే యముడు అతని ప్రాణాల్ని తీసుకొనిపోతాడు. సావిత్రి మహా పతివ్రత. ముందుగానే ఈ సంగతిని పసిగట్టింది. పతిభిక్ష పెట్టమని యముణ్ణి వెంటాడింది. "ఏమాత్రం ప్రయోజనం లేదు, తిరిగి వెళ్ళిపో!" అంటున్నాడు యముడు. కానీ సావిత్రి పట్టు వదల్లేదు.

రాళ్ళు రప్పలు ముండ్ల పొదలతో నిండిన అడవిదారి. కాలుదీసి కాలుపెట్టడానికి వీల్లేదు. యముడేమో దర్జాగా దున్నపోతుమీద వెళుతున్నాడు. సావిత్రి దేనినీ లెక్కచెయ్యలేదు. అలాంటి దారి వెంబడే యముడి వెంటపడింది. గుట్టల్ని, పుట్టల్ని, కొండల్ని, కోనల్ని దాటిపోతూనే ఉంది. యముడు వారిస్తూనే ఉన్నాడు. అయినా సావిత్రి తనపట్టు వదల్లేదు.

కట్టెలమ్మి పొట్టపోసుకునే మనిషికోసం సాటి ఆడది పడుతున్న అవస్థను చూస్తుంటే కాంతమ్మ బుర్రలో రకరకాల ఆలోచనలు. కుదురుగా కూర్చోలేకపోతూఉంది. క్షణక్షణానికి తన బతుకు కొట్టొచ్చినట్లు కంటెదుట కనపడుతూ ఉంది.

"కోడి కూసే యాళకాడ లేస్తాడు. గుక్కడు సద్దినీళ్ళు గొంతులో పోసుకుంటాడు. అడివి మింద పడతాడు. నడ్డి నీలిగే మోపు తలకెత్తుకొంటాడు. పేటదాక నడస్తాడు. అక్కడ దించమన్న చోట దించి, వద్దన్న చోట తలకెత్తి కన్నగసాట్లు పడితేగదా కడుపు కంత తిండి!– గడపదాట కుండా చూసుకుంటా ఉండాడే! అంతమంచి మణిసికి అంత తిండి కూడ పెట్టకుండా నేనేం వో ముక్కలదాక మెక్కి వచ్చేశానే పాపిష్టిదాన్ని!– నేనూ ఆడదే! తానూ ఆడదే! అయితే కూడ ఆ ఆడది మొగుడికోసం ఎన్నగసాట్లు పడతా ఉండాది? నేనేంవో!"– కాంతమ్మలో మనిషి మేలుకొని మాట్లాడుతూ ఉంది.

చివాలున పైకి లేచింది కాంతమ్మ!

"అప్పుడే లేస్తావుండావెందుకే?– ఇంకనేగదా ఉందేదంతా కత!– సావిత్రి అత్తమాంవలకు కండ్లు తెప్పించుకోవాల, పోగొట్టుకుణ్ణ రాజ్యాన్ని పొందాల. మొగుణ్ణి బతికించుకోవాల!– ఇంకా ఇంతాటుంటే అప్పుడే లేసినావే! కూసో!"– సతీ సావిత్రి కథ తెలిసిన ఓ ఆవిడ సలహా ఇచ్చింది.

అదేమీ కాంతమ్మ చెవికెక్కలేదు.

సంచిపట్ట మడిచి చంకలో పెట్టుకొనింది.

ఒక్క ఊపులో ఇల్లు చేరింది.

కనిపించిన దృశ్యంతో కదిలీ మెదలకుండా నిలబడింది.

గుడిసెలో గుంజకు అనుకున్నాడు అప్పన్న. అలిసి సొలిసిన ప్రాణం. ఆనుకున్నవాడు ఆనుకున్నట్లే నిద్రపోతున్నాడు. అతడిముందు మూకుట్లో సంకటి చల్లబడిపోయింది. చల్లబడిన సంకటిమీద ఈగలు ముసురుతున్నాయి. ఎప్పుడో సందకాడ వెలిగించిన బుడ్డీ దీపం కొండెక్కడానికి సిద్ధంగా ఉంది.

అప్పన్న కుక్క–

మూకుడు ముందర ముందరి కాళ్ళు బారసాచి పడుకొనిఉంది.

సూటిగా అతని మొగంలోనికి చూస్తూ వొగిరిస్తూ ఉంది.

ఆ వొగిరింపులో తపన ఉంది.

ఎగిరెగిరిపడుతున్న ఎండిన డొక్కల్లో ఆకలి గూడుకట్టుకొని ఉంది. యజమాని తింటే తనకంత వేస్తాడని ఎదురుచూస్తూ ఉంది.

అది దాని నమ్మకం!

అప్పన్న తినలేదు! అదీ తినలేదు!

అలికిడైతే ఎగిరిపడి మొరిగే కుక్క!

కాసంత కవళం కంటపడితే ఎగరేసుకుపోయే కుక్క! – యజమాని తినలేదన్న తపనలో!

విశ్వాసంలో ఏకాగ్రత!

మూకుట్లో వేసిన సంకటిని తినడానికి కూడ ఓపిక లేక అలానే గుంజకు చేరగిలబడి నిద్రపోతున్న భర్తను చూసింది కాంతమ్మ.

ఆమె గుండె బాధగా మూలిగింది!

యజమాని తినలేదని తానూ తినకుండా తపిస్తూ ఎదురుచూస్తున్న కుక్కను గమనించింది.

గతం ఒక్కసారి కండ్లముందు గిర్రున తిరిగితే పలపలా రాలుతూ కన్నీటి ముత్యాలు– పశ్చాత్తాపానికి ప్రతిరూపాలుగా! ●

జ్యోతి మాసపత్రిక
(1, ఏప్రిల్ 1981)